నిరుపయోగంగా రైతు బజార్

- ప్రారంభం నుంచి ఖాళీగానే షాపులు
- లక్షల వ్యయంతో నిర్మించినా ముందుకు రాని వ్యాపారులు
- పూల మార్కెట్ అయినా సక్సెస్ అయ్యేనా?



జీఎస్ రాజు రోడ్డులోని రైతు బజార్‌లో ఖాళీగా దర్శనమిస్తున్న షాపులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు సరసమైన ధరలకు అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన రైతు బజార్ నిరుపయోగంగా మారింది. రైతు బజారులో 90శాతానికి పైగా షాపులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. కేవలం పది శాతం షాపులు మాత్రమే తెరిచి కార్యకలాపాలు సాగిస్తున్నారు. షాపులు నిర్వహించేందుకు రైతులు, డ్వాక్రా సభ్యులు ముందుకు రాకపోవడంతో ఖాళీగా మిగిలిపోయాయి. ఇక్కడ వ్యాపారాలు సరిగా లేకపోవడం వల్లనే షాపులు కేటాయించినా లబ్ధిదారులు తీసుకోలేదనే వాదన వినిపిస్తోంది. దీంతో రైతు బజార్ ఆశించిన స్థాయిలో కార్యకలాపాలు కొనసాగించడం లేదు. అధికారులు దీనిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సిద్ధమయ్యారు.

వ్యాపారాలు లేవు

జీఎస్ రాజు రోడ్డులో ఏర్పాటు చేసిన రైతు బజార్‌కు అత్యంత సమీపంలో కేదారేశ్వరపేట, అలంకార్ సెంటర్ రైతు బజార్లు ఉన్నాయి. ఈ రైతు బజార్‌తో పోలిస్తే వాటిలో షాపుల సంఖ్య కూడా ఎక్కువే. ఇది ప్రధాన రహదారి పక్కనే ఉన్నప్పటికీ వ్యాపారాలు లేవని షాపుల నిర్వాహకులు చెబుతున్నారు. షాపులు ప్రారంభిస్తే నెలసరి అద్దె చెల్లించేందుకు కూడా డబ్బులు వచ్చే పరిస్థితి లేదని వ్యాపారులు చెబుతున్నారు. అయితే ఇందులో రాజకీయ కారణాలతో కూడా కొందరు షాపులు దక్కించుకున్నా తెరవడం లేదనే వాదన వినిపిస్తోంది. ఒకరిద్దరు రెండుమూడు నెలల పాటు షాపు నిర్వహించి లాభసాటిగా లేకపోవడంతో వదిలివేసినట్లు తెలిసింది.

పూల వ్యాపారులకు కేటాయించేందుకు ఏర్పాట్లు

ఈ రైతు బజార్‌ను నాన్ ఫంక్షనింగ్ మార్కెటింగ్ అధికారులు గుర్తించారు. మున్సిపల్ కార్పొరేషన్ పక్కన ఉన్న పూల మార్కెట్‌ను ఇక్కడికి తరలించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే పూల మార్కెట్ వ్యాపారులు తమకు రైతు బజారును కేటాయించాలంటూ జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చినట్లు తెలిసింది.

స్థానిక ప్రజాప్రతినిధి రైతు బజార్‌ను పూల మార్కెట్‌గా మార్చాలన్న ప్రతిపాదనకు అంగీకారం తెలిపినట్లు సమాచారం. అయితే కూరగాయల వ్యాపారమే అంతంత మాత్రంగా ఉందని, ఇక పూల వ్యాపారులకు ఈ మార్కెట్ ఎలా అనుకూలంగా ఉంటుందన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

రూ. 61.50 లక్షలతో 78 షాపులు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గాంధీనగర్ జీఎస్ రాజు రోడ్డు పక్కన ఏలూరు కాలువ ఒడ్డున రైతు బజార్‌ను ఏర్పాటు చేసింది. రూ. 61.50 లక్షల నిధులతో 78 షాపులు నిర్మించింది. వ్యాపారుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. మార్కెటింగ్ శాఖ అర్హులకు షాపులు కేటాయించేందుకు నోటిఫికేషన్ ఇచ్చారు. జూన్ 2023లో ప్రారంభమైన రైతు బజార్‌లో 15 రైతులకు, ఐదు డ్వాక్రా మహిళలకు కేటాయించిన షాపులు ప్రారంభమయ్యాయి. 58 షాపులు ఖాళీగానే ఉన్నాయి. అప్పటి నుంచి 20 షాపులు మాత్రమే తెరుస్తున్నారు. మిగిలిన షాపులు దక్కించుకున్న వారు వ్యాపారాలు నిర్వహించేందుకు ముందుకు రాలేదు. దీంతో ప్రారంభం నుంచి ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో రూ. లక్షల వ్యయంతో నిర్మించిన రైతు బజార్ నిరుపయోగంగా మారింది.

ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టాం

ఆర్డర్లు కూడా తీసుకోలేదు. ప్రారంభం నుంచి ఇక్కడ 50కు పైగా షాపులు ఖాళీగానే ఉన్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టాం. దీనిని పూల మార్కెట్‌గా మార్చాలన్న ప్రతిపాదన ఉంది. పూలమార్కెట్ నుంచి ఎంత మంది వ్యాపారులు తరలివస్తారు? ఈఓ జీతాలు, నిర్వహణ ఖర్చులు వంటి విషయాలన్నీ సరిచూసుకుని వారికి షాపులు కేటాయిస్తాం. ఇక్కడ ఇప్పటికే ఉన్న కూరగాయల వ్యాపారులకు పక్కనే ఉన్న కేదారేశ్వరపేట లేదా అలంకార్ సెంటర్‌లోని రైతు బజార్‌లో షాపులు కేటాయిస్తాం. ఇక్కడ ఉన్న షాపుల సంఖ్య కంటే తక్కువ మంది పూల వ్యాపారులు వస్తే కూరగాయల వ్యాపారులను కూడా కొనసాగిస్తాం.

–మంగమ్మ, ఏడీ, మార్కెటింగ్



మెయిన్ రోడ్డు వైపు మూసివేసిన ఖాళీ షాపులు



జీఎస్ రాజు రోడ్డులో ఏర్పాటు చేసిన రైతు బజార్

క్లుప్తంగా

ఎస్ఆర్ఆర్‌లో ఎన్‌సీసీ పునఃప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ పునఃప్రారంభమయ్యింది. గతంలో సాంకేతిక కారణాలతో కళాశాలలో ఎన్‌సీసీని రద్దు చేశారు. కళాశాల సిబ్బంది, విద్యార్థుల కృషి ఫలితంగా ఎన్‌సీసీని పునరుద్ధరించారు. ఈ సందర్భంగా వైమానిక దళాధికారులు సూరజ్, హరీష్‌లు పాల్గొని విద్యార్థుల చేత ఎన్‌సీసీ పరేడ్ చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ఎన్‌సీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి మాల్యాద్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

అవినాష్‌కు సత్కారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌ను శనివారం వైఎస్సార్ సీపీ నగర అధికార ప్రతినిధి ప్రభల శ్రీనివాస్, సేవాదళ్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎస్ నారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

నిత్యావసర కిట్ల పంపిణీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద బాధితులకు రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ శ్రీ దుర్గ నిత్యావసర వస్తువుల కిట్లు పంపిణీ చేసింది. గవర్నర్‌పేటలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద రోటరీక్లబ్ ఆఫ్ విజయవాడ శ్రీ దుర్గ ఆధ్వర్యంలో శనివారం కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ కె. శివనాగేశ్వరరావు చేతుల మీదుగా కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న క్లబ్ అధ్యక్షుడు కె.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ గ్రాంట్ రూ. 1.20 లక్షలతో 60 కుటుంబాలకు నిత్యావసర కిట్లు సమకూర్చినట్లు తెలిపారు. సామాజిక శ్రేయస్సు కోసం రోటరీ క్లబ్ చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో జిల్లా పూర్వపు గవర్నర్ ఎం.సి. దాస్, రవీంద్ర, ఎల్ఐసీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని విజయవాడ ఆర్ట్ సొసైటీ, ఠాగూర్ స్మారక గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో శనివారం ఈ పోటీలు జరిగాయి. వివిధ పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. పోటీలు సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ మూడు కేటగిరీల్లో జరిగాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి రమాదేవి మాట్లాడుతూ విజేతలకు ఈనెల 20వ తేదీన బహుమతుల ప్రదానోత్సవం జరుగుతుందని తెలిపారు. అలాగే ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు కొలుసు సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులు ఎ. అప్పారావు, ఎం. వి. రమణ, దివాకర్, మహారాణా, సి.హెచ్. ఉదయ శంకర్, ఎ. గంగాభవాని, రవికుమార్, సి.హెచ్. మురళీధర్, ఎస్. రవిబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

15న శివపార్వతుల కల్యాణం

విజయవాడ కల్చరల్: మధురానగర్‌లో పప్పుల మిల్ సెంటర్‌లోని బాలాంజనేయ స్వామి దేవాలయంలో కొలువైవున్న శివ పార్వతులకు కార్తిక మాసం సందర్భంగా ఈ నెల 15వ తేదీన కల్యాణం నిర్వహించనున్నట్లు అర్చక స్వామి పులిపాక రాఘవ కిషోర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగమోక్తంగా కార్యక్రమం వైభవంగా జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. వివరాలకు 97045 79995 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. అలాగే దేవాలయంలో కార్తిక మాస ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జాతీయస్థాయి ఈత పోటీలకు ఎంపిక



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గుజరాత్‌లో 24వ తేదీ నుంచి నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్‌కు చెందిన స్విమ్మర్లు ఎంపికైనట్లు కోచ్ రఫీ తెలిపారు. కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను కోచ్, తోటి స్విమ్మర్లు అభినందించారు. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు నర్సరావుపేటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కూల్స్ గేమ్స్ చాంపియన్స్ పోటీల్లో కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ పొందిన ఎస్. శ్రుతి హర్షిక వంద మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో రెండో స్థానం, రెండు వందల మీటర్ల విభాగంలో మూడో స్థానంలో నిలిచాడన్నారు. ఎస్. చంద్ర హర్షిల్ రెండు వందల మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో రెండో స్థానంలో, కె. భావేష్ 1,500 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో మూడో స్థానంలో నిలిచి జాతీయ పోటీలకు అర్హత సాధించారని వెల్లడించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన స్విమ్మర్లకు నగర పాలక సంస్థ అధికారులు, జిల్లా స్విమ్మింగ్ సంఘ సభ్యులు అభినందనలు తెలిపారు.

భవానీ దీక్షలకు పటిష్ట బందోబస్తు

పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు



భవానీ దీక్షల బందోబస్తుపై చర్చిస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడస్పోర్ట్స్: శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఈనెల 11 నుంచి డిసెంబర్ 25వ తేదీ వరకు జరిగే భవానీ దీక్షల కార్యక్రమానికి పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లపై కమాండ్ కంట్రోల్ రూంలో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ రాజశేఖరబాబు మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు భవానీ దీక్షల మాలాధారణ, డిసెంబర్ 14న కలశ జ్యోతి, డిసెంబర్ 21 నుంచి 25వ తేదీ వరకు దీక్షల విరమణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వస్తారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన చర్యలను సమావేశంలో చర్చించారు. సమావేశంలో ఆలయ ఈఓ కె.ఎస్. రామారావు, డీసీపీలు గౌతమి శాలి, ఉదయరాణి, తిరుమలేశ్వర రెడ్డి, కృష్ణమూర్తి నాయుడు, ప్రసాద్, ఏడీసీపీలు రామకృష్ణ, ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

వర్సిటీ క్రీడా ప్రాంగణాల నిర్వహణను ఏసీఏకి ఇవ్వండి

గవర్నర్‌కు ఎంపీ, ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని వినతి



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ, ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్రంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల పరిధిలోని క్రీడా ప్రాంగణాల నిర్వహణ, అభివృద్ధి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు విజయవాడ ఎంపీ, ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని) విజ్ఞప్తి చేశారు. ఏసీఏ కార్యదర్శి సానా సతీష్‌బాబు, కోశాధికారి డి. శ్రీనివాస్‌తో కలిసి ఎంపీ చిన్ని శనివారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వర్సిటీల క్రీడా ప్రాంగణాల నిర్వహణ, అభివృద్ధికి సంబంధించిన ఒప్పంద నియమాల విషయమై గవర్నర్‌తో ఏసీఏ ప్రతినిధులు చర్చించినట్లు ఆంధ్రా క్రికెట్ సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది.

కళాకారులు సాంస్కృతిక వారధులు



సాహితీ సంస్థల ప్రతినిధులను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని ప్రముఖ న్యాయవాది ముష్టి శ్రీనివాస్ అన్నారు. ఏఎస్ మెలోడీస్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై శనివారం ఆ సంస్థ ఆవిర్భావ సభ, సినీ సంగీత విభావరి, వివిధ రంగాలకు చెందిన వారికి ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ సాంస్కృతిక కళాసంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని సూచించారు. నూతన సంస్థ విజయవంతం కావాలని ఆశీర్వదించారు. సంస్థ వ్యవస్థాపకురాలు షేక్ సబానా మాట్లాడుతూ విలువలతో కూడిన కార్యక్రమాలను రూపొందించి వేదికపై ప్రదర్శిస్తామని తెలిపారు. కార్యక్రమ కోఆర్డినేటర్ ఆరిఫ్ మాట్లాడుతూ ప్రతి నెలా కార్యక్రమాలను నిర్వహిస్తామని, నూతన గాయనీ గాయకులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. కళాకారుల సంక్షేమం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. గాయనీ గాయకులు మల్లాది స్వాతి, షబానా, శ్రావణి వెంకట్ తదితరులు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన మీరా కుమార్, ముష్టి శ్రీనివాస్, చింతకాయల చిట్టిబాబు, డేవిడ్ రాజులను ఆత్మీయంగా సత్కరించారు.

దాసాంజనేయునికి సిందూర పూజలు

మధురానగర్ (విజయవాడసెంట్రల్): స్వయంభూ శ్రీ మాచవరం దాసాంజనేయ స్వామి వారి దేవాలయంలో శనివారం స్వామివారికి సిందూరం, ఆకు పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు పలువురు కళాకారులు నృత్య నీరాజనాలను అర్పించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన శ్రీ కూచిపూడి నృత్య అకాడమీకి చెందిన కొండవీటి శ్రీదేవి శిష్యబృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. కోరపాటి అన్విత శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారికి పంచ హారతుల సేవ అనంతరం కళావేదికపై నిర్వహించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. నృత్య ప్రదర్శన అనంతరం కళాకారులను ఆలయ డీఈవో రత్నరాజు అభినందించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

ట్రాక్టర్ల ద్వారా చెత్త తరలింపు



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 29వ డివిజన్ మధురానగర్‌లో శనివారం ట్రాక్టర్ల ద్వారా చెత్తను తరలించారు. గతంలో క్లాప్ వాహనాల ద్వారా చెత్తను తరలించేవారు. దీంతో చెత్త బయటకు వచ్చేది కాదు. కానీ ఇప్పుడు ట్రాక్టర్ల ద్వారా చెత్తను తరలించడంతో చెత్తచెదారం దారి పొడవునా పడిపోవడంతో పాటు దుర్వాసన వస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చట్టం ముందు అందరూ సమానమే



సదస్సులో పాల్గొన్న మండల న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు

పాయకాపురం(విజయవాడరూరల్): చట్టం ముందు అందరూ సమానులేనని మండల న్యాయసేవాధికార సంస్థ అధికారి పి. రాము పేర్కొన్నారు. వాంబే కాలనీలో అమ్మ ప్రేమ ఆధారణ సేవా సంస్థలో శనివారం జాతీయ న్యాయసేవల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనిక, పేద తారతమ్యం లేకుండా అందరికీ న్యాయసేవలు అందుబాటులో ఉంటాయని అన్నారు. పేదలు ఎలాంటి ఖర్చు లేకుండా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు పొందవచ్చునని తెలిపారు. సేవా సంస్థ అధ్యక్షురాలు అన్నపూర్ణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ప్యారాలీగల్ వలంటీర్లు బి. రామకృష్ణ, గణేశ్వరమ్మ, స్థానికులు పాల్గొన్నారు.

నేరాలు నియంత్రించాలి



వినతి పత్రం అందజేస్తున్న గులాబీతోట రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 27వ డివిజన్ గులాబీతోటలో నేరాలు నియంత్రించడంతోపాటు గస్తీ పెంచాలని గులాబీతోట రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు శనివారం పోలీసులకు వినతి పత్రం అందజేశారు. సౌత్ ఏసీపీ బంగార్రాజు, సెంట్రల్ ఏసీపీ దామోదర్, గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్, 4వ టౌన్ సీఐ ఆలీలను కలిసి అసోసియేషన్ నేతలు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మందా రాము మాట్లాడుతూ ఇటీవల ఇక్కడ బైక్ దొంగతనాలు పెరిగిపోయాయన్నారు. దీంతో పోలీసు అధికారులకు వినతి పత్రం అందజేశామని తెలిపారు. దీనిపై స్పందించిన ఏసీపీ దామోదర్, సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్‌లు గులాబీతోటలో పర్యటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు బోధనలకు అనుగుణంగా నడుచుకోవాలి



ప్రసంగిస్తున్న రెవ. జోసఫ్, పాస్టర్ మోజెస్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఏసుక్రీస్తు నేర్పిన ప్రేమ, కరుణ, దయ, త్యాగం వంటి బోధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని బీసీటీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి రెవ.మంగలపూడి జోసఫ్ అన్నారు. సింగ్‌నగర్ గిద్యోను మందిరం క్రీస్తు మార్గం చర్చి ఆధ్వర్యంలో చేపట్టిన 13వ క్రీస్తు స్తుతి సువార్త సభ శనివారం ఘనంగా జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రెవ.జోసఫ్ ప్రసంగిస్తూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు. ప్రధానంగా ఆపదలో ఉన్నవారికి, లేమితో బాధపడుతున్న వారికి మనవంతు సహకారం అందించి ఆదుకోవాలని పిలుపునిచ్చారు. నిరుపేదలకు సహాయం చేయడం దేవునికి సేవ చేయడంతో సమానమని, అందరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ముందుగా సండే స్కూల్ చిన్నారులు, యూత్ కమిటీ సభ్యులు ప్రదర్శించిన పలు నాటికలు, సువార్త గాయకుడు ఎన్. మణిబాబు ఆలపించిన గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. రెవ. కలపాల జాషువ, దొండపాటి ప్రభాకర్, నందిగం ఇర్మియా, సంఘకాపరి నందిగం మోజెస్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



ఘనంగా తిరుమంజనం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవం శనివారం వైభవంగా జరిగింది. బ్రాహ్మణవీధిలో దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని పురాతన ఆలయాల్లో ఒకటైన వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామివారికి శాంతి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కార్తిక మాసంలో వచ్చే శ్రవణానక్షత్రానికి విశేషం ఉందని పండితులు చెబుతారు. అందులోనూ స్వామి వారికి ప్రీతికరమైన శనివారం సైతం రావడంతో అత్యంత పవిత్రమైనదిగా భావించి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులను మేళతాళాలతో తీసుకొచ్చి కల్యాణ వేదికపై వేంచేయించారు. అనంతరం ఆలయ అర్చకస్వాములు పి. రామచంద్రమూర్తి పర్యవేక్షణలో స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తొలుత విష్వక్సేన పూజతో కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం మహాసంకల్పం, ప్రవర, యజ్ఞపవీత ధారణ, జీలకర్రబెల్లం ధారణ, మాంగళ్యధారణ, చివరిగా తలంబ్రాల సమర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయంలోని స్వామివారి మూలవిరాట్‌కు తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో స్వామివారిని అభిషేకించారు.

కాత్యాయినిదేవిగా భ్రమరాంబ అమ్మవారు దర్శనం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పాతశివాలయంలో భ్రమరాంబ అమ్మవారు శనివారం కాత్యాయినిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వన్‌టౌన్‌లోని పురాతన ఆలయమైన భ్రమరాంబ మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం (పాత శివాలయం)లో కార్తికమాసాన్ని పురస్కరించుకొని కార్తిక నక్తదీక్షా మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా అమ్మవారు రోజుకొక విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. మహోత్సవాల్లో భాగంగా ఆలయంలో శనివారం పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. కాత్యాయినిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి సహస్రనామార్చనతో పాటుగా విశేషంగా త్రిశతి, ఖడ్గమాల తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన, ఆలయ ప్రదక్షిణలు, పంచహారతులు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించారు.